ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లాలో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే "పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం"ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేసిన కారణంగా, ఎన్నికల కోడ్ జనవరి 29 నుండి మార్చి 8 వరకు అమలులో ఉంటుంది. ఈ కారణంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే "పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం"ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే, పునః ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదుల కొరకు జిల్లా పోలీసు కార్యాలయానికి రాకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో ఏపీకి ఒరిగిందేమీ లేదు..!

వైసిపి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ కరణం ధర్మశ్రీ



విశాలాంధ్ర-అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం లోకసభలో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ సూత్రప్రాయంగా కాస్త ఆమోదయోగ్యంగా ఉన్నా బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని వైయస్సార్సీపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్ పై తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. తనదైన శైలిలో సునిశిత విమర్శలు చేశారు. బడ్జెట్ లో బీహార్ కు వరాల జల్లు కురిపించిన కేంద్రం ఏపీకి మాత్రం మొండి చేయి చూపించిందని ఆరోపించారు. ఏపీపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ పేరే ప్రస్తావనకు రాకపోవడం విచారకరం అన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన రాష్ట్రానికి భారీగా నిధులు సమకూర్చుకుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఏపీకి గుండు సున్నా తెచ్చారని ఆక్షేపించారు. చంద్రబాబు చేతకానితనానికి బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడమే నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం చేతకానితనం వల్లే బడ్జెట్ లో ఏపీకి అన్యాయం జరిగిందని విమర్శించారు. పెట్టుబడిదారులకు మేలు చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా సీఎం చంద్రబాబు ఏపీకి నిధులు సాధించలేకపోయారని ఆరోపించారు. ఇది సిగ్గుచేటు అన్నారు. 21 మంది ఎంపీలు ఉన్నా ఏపీకి ఏమాత్రం ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరం అన్నారు. ఈ బడ్జెట్ ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను పూర్తిగా నిరాశపరిచిందని ధర్మ శ్రీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అసంఘటిత రంగానికి బడ్జెట్లో మొండిచెయ్యి

ఏఐటీయూసీ నేత కోన విమర్శ

విశాలాంధ్ర-అనకాపల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద వర్గాలను, అసంఘటిత రంగాన్ని నిరుత్సాహపరిచిందని ఏఐటీయూసీరాష్ట్ర సమితి సభ్యులు జిల్లా కోన లక్ష్మణ ఒక్క ప్రకటన లో విమర్శించారు. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం అదుపులో లేకపోవడంతో నిజ వేతనాలు అందుకు అనుగుణంగా పెరగలేదన్నారు. జీవన వ్యయం పెరగడం వల్ల ఈ వర్గాలు చితికిపోయాయన్నారు. ఈ వర్గాలకు బడ్జెట్లో ఎలాంటి ఉపశమనం కల్పించకపోవడం శోచనీయమన్నారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక దివాళాకోరు విధానాల వల్ల రూపాయి అంతర్జాతీయ విపణిలో కుదేలయిందని, దీనివల్ల విదేశాలలో విద్యను ఆర్జిస్తున్న భారత విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర-మునగపాక: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిచెందిన మునగపాక గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శనివారం తెల్లవారు జామున నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెంటకోట ఆదినారాయణ, ఉత్సవ కమిటీ సెక్రటరీ ఆడారి అప్పలనాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్, యలమంచిలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, దాడి అప్పలనాయుడు, ఆడారి కన్నబాబు, దాడి శివ, ఆడారి శ్రీకాంత్, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు, వాడ్రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి రాము, పెంటకోట ఆదినారాయణ నాయుడు పెంటకోట అప్పలనాయుడు పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో జోరుగా అక్రమ షెడ్ల నిర్మాణం

పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

విశాలాంధ్ర-పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో అక్రమ షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. స్థానిక ఎస్సీ కాలనీకి ఎదురుగా రహదారి పక్కనే ఈ నిర్మాణం జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం దీనిపై పిర్యాదు వెళ్లడంతో అప్పట్లో స్థానిక సచివాలయ సిబ్బంది ఈ అక్రమ కట్టడాన్ని అడ్డుకున్నారు. కొన్నాళ్ళుగా సైలెంట్ గా ఉన్న నిర్మాణదారులు ప్రస్తుతం ఓ షెడ్ల నిర్మాణాన్ని ఇటీవల తిరిగి ప్రారంభించారు. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అటువైపు చూడ్డం లేదు సామాన్యుడు ఏదైనా చిన్న షెడ్ నిర్మించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టే టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ బడా బాబుల షెడ్ల నిర్మాణాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం అనేక విమర్శలకు తావిస్తోంది. మరో పక్క జీవీఎంసీ ఆదాయానికి కూడా భారీగానే గండి పడుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులే ఇప్పటి కూటమి ప్రభుత్వంలో కూడా అక్రమ నిర్మాణాలు జరపడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ అక్రమ షెడ్ల నిర్మాణాన్ని అడ్డుకొని చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పెసలమ్మ తల్లి అమ్మవారికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని అసకపల్లి పంచా యితీ శివారు సున్నం బట్టీలు గ్రామంలో గ్రామ ప్రజలు ఆరాధ్యదైవ మైన శ్రీశ్రీ పసలమ్మ తల్లి అమ్మవారి 30వ తీర్థ మహోత్సవం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం అలవరుచుకొని, భక్తి భావం పెంపొందించుకోవాలని ప్రజలను కోరారు. సాయంత్రం ఆరు గంటల నుండి డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం అలాగే పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రీ నరసింగరావు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కర్రీ కనకరాజు, కూటమి నాయకులు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, పి.బి.వి.ఎస్. ఎన్ రాజు(బుచ్చిరాజు), గవర అప్పారావు, ఈపు అప్పలరాజు ,గవర సత్యనారాయణ, కర్రీ శ్రీనివాసరావు, కర్రీ కృష్ణ, అత్యధికంగా మహిళలు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ లో కోట్లు కొల్లగొట్టిన రికవరీలు ఉండవ్ చర్యలు నిల్!

అక్రమార్కులకు "సహకారం" ఆ శాఖ అధికారులే

కమిషనర్ కు ఫిర్యాదు ప్రజా సంకల్ప వేదిక (ఆర్టిఐ) రాష్ట్ర అధ్యక్షుడు జక్కు

విశాలాంధ్ర-గొలుగొండ: అనకాపల్లి జిల్లాలో సహకార శాఖ ఆధీనంలో గల పిఎసిఎస్ లో కార్యదర్శులు కోట్లు కొల్లగొట్టి అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ జరిగినా రికవరీలు గాని చర్యలుగాని లేవని సంబంధిత శాఖ అధికారులు సహకారం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని వీటన్నింటిపై సహకార శాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ప్రజా సంకల్ప వేదిక (ఆర్టిఐ) రాష్ట్ర అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా లో 98 పిఎసిఎస్ లు ఉన్నాయని వాటిలో కొన్ని చోట్ల అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో జీవో నెంబర్ 51, 52 ల ద్వారా విచారణలు జరిపారని వాటిని బహిరంగపరచాలని డిమాండ్ చేశారు రోలుగుంట మండలంలో జానకిరామపురం పిఎసిఎస్ లో సుమారు 40 లక్షల నిర్ధారించారని నర్సీపట్నం మండలంలో చెట్టు పల్లి పీఏసీఎస్ 95 లక్షలు నిర్ధారించి ఆక్స్ న్ నోటీసులు జారీ చేశారని అయినా చర్యలు ఎక్కడ అని ప్రశ్నించారు. దీంతో గుంటూరులో గల రాష్ట్ర సహకార కమిషనర్ కు పూర్తి నివేదికతో ఫిర్యాదు చేయడం జరుగుతుందని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి ఈ సందర్భంగా తెలియజేశారు.

ఘనంగా మోదకొండమ్మ పండుగలు

విశాలాంధ్ర-వి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల శ్రీమోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పండుగలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వంటలు చేసుకుని భోజన కార్యక్రమాలు నిర్వహించారు.

"అమ్మ సేవా సంస్థ" ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో నారాయుడుపాలెం గ్రామంలో "అమ్మ సేవా సంస్థ"అధ్వర్యంలో భువనేశ్వరి కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. పాడి రైతులకు, గ్రామ ప్రజలకు డాక్టర్ ఎల్.నరసింహ మూర్తి,పి. ప్రకాష్,కె.ఎస్ మిశ్రా,పానీ గ్రహి,నాగేశ్వర్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు తో బాటు బీపీ, షుగర్, అధికబరువు మొదలగు పరీక్షలు ఉచితంగా చేయడం తో బాటు అవసరం అయిన వారికి తక్కువ ధరకు కళ్ళ అద్దాలు ఇవ్వటం జరిగింది. "అమ్మ సేవా సంస్థ "వ్యవస్థాపకులు సబ్బి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ కారుకుంది వెంకట రాజు, ఉప సర్పంచ్ మొళ్ళి నుకప్పారావు, గ్రామ పెద్దలు కొయ్యా రమణ, చందనాటి శ్రీనివాసరావు, యలమంచిలి గోవింద, దాసరి గోపాల కృష్ణ, దాసరి సంతోష్, సబ్బి కృష్ణ, కొయ్యా శ్రీను, కొల్లి నాగ, ఇళ్లపు గణేష్, డెయిరీ పిఎస్ కోన శ్రీనివాసరావు వైద్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ, డాక్టర్ సురేష్, శ్రీనివాస్, లక్ష్మి ,రవిబాబు పాల్గొన్నారు.

విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

అవంతి లో ముగిసిన జాతీయస్థాయి సాంకేతిక సమావేశంలో వక్తలు

వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-మాకవరపాలెం : అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సినర్జీ 20 25 రెండు రోజుల జాతీయస్థాయి సాంకేతిక సమావేశం ముగిసింది. అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సాంకేతిక సమావేశం ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా విశాఖపట్నం హిందుస్థాన్ షిప్యార్డ్ జనరల్ మేనేజర్ డి శ్రీనివాసరావు జె ఎన్ టి యుజివి విజయనగరం డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డాక్టర్ కె.బాబులు ప్రత్యేక అతిధులుగా ఐఐటి భువనేశ్వర్ స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డాక్టర్ శ్రీనివాస పినిశెట్టి ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటి డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి ఎన్ఐటి వరంగల్ డిపార్ట్మెంట్ ఆఫ్ ట్రిబుల్ ఈ డాక్టర్ సిహెచ్ రాములు, phytech ఎంబాడెడ్ మేనే జింగ్ డైరెక్టర్ బి.వల్లభరావు హాజరయ్యారు. విశాఖపట్నం హిందు స్తాన్ షిప్యార్డ్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మీరు నేర్చుకునే విద్య నైతిక విలువలతో ఉన్నప్పుడు మాత్రమే మీ విద్య మీకు సమాజానికి ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు నిరంతరం జ్ఞానాన్ని సంపాదిస్తూ ఉండాలి అప్పుడే మీరు నిర్దేశించిన లక్ష్యాలను సాధించగలరని అన్నారు. అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశానికి యువత విలువైన ఆస్తిగా పరిగణిస్తూ భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి స్వామి వివేకానంద చాటి చెప్పారని అలాగే వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొని సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని మంచి ఫలితాలను సాధించగలరని ఆకాంక్షించారు. జేఎన్టీయూ జీవీ డైరెక్టర్ ఆఫ్ కె బాబులు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమములు నిర్వహించటం ద్వారా సాంకేతిక విజ్ఞానంతో పాటు మేనేజ్మెంట్ నైపుణ్యం కూడా అర్థమవుతుంది ఇంజనీరింగ్ చదువుకున్న వారు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి ఉపాధి సంపాదించాలంటే ప్రతిరోజు తరగతి గదిలో కష్టపడి పాఠాలు చదువుకొని విజ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు. అలాగే విద్యార్థులు మొబైల్ కు కేటాయించే సమయాన్ని తగ్గించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ సి మోహన్ రావు మాట్లాడుతూ అవంతి కళాశాలలతో పాటు వివిధ కళాశాల నందు 54 సాంకేతిక నమూనాలు 230కి పైగా పేపర్ ప్రజెంటేషన్ 86 కి పైగా పోస్టర్ 170 గ్రూప్స్ టెక్నికల్ క్విజ్ మరియు కోడ్ హంట్ లో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా పదివేల రూపాయలు ద్వితీయ బహుమతికి 5000 రూపాయలు నగదు బహుమతి ప్రధానం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరిని అభినందించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా వచ్చిన పెద్దల నుండి సాంకేతిక పరిజ్ఞానము కోసం ఉపన్యాసాలు చేసి విద్యార్థిని విద్యార్థులను ప్రేరేపించారు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థుల వివరాలు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు మొదట బహుమతి సూర్యరష్మీ ఆధారిత పాడైన రాలు పట్టాను గుర్తించు నమూనాకు రెండవ బహుమతి నదులు చెరువులలో చెత్త సేకరించే పడవ నమూనా కి వచ్చింది.

సామూహిక లక్ష్మి గణపతి హోమం, మహా అన్నదానం

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్య సిద్ధి గణపతి దేవస్థానంలో మాఘ శుద్ధ చవితి సందర్భంగా ఆదివారం భక్తులు, మహిళలు, పుర ప్రముఖులు విద్యార్థులు చే సామూహికంగా లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. మాఘ మాసం శరత్ రుతువులు సందర్భంగా వేకువ జామునే భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం సామూహిక లక్ష్మి గణపతి హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. అనకాపల్లి మండలం గణపర్తి గ్రామానికి చెందిన దాడి సాంబశివరావు ఆర్థిక సహకారంతో హోమంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వేద పండితులు, స్వయంభు శివాలయం ప్రధాన అర్చకులు కొడమంచిలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్), ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి సాంభశివరావు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆర్థిక భరోసే సంస్థ లక్ష్యం

సమగ్ర రైతు సహకార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట్

విశాలాంధ్ర-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని సమగ్ర రైతు సహకార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. వెంకట అన్నారు. ఆదివారం రామచంద్రపాలెం గ్రామంలో నిరుపేదలకు సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారికి సంస్థ ద్వారా సబ్సిడీపై పరికరాలు అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించే విధంగా తమ సంస్థ తోడ్పాటు అందిస్తుంది అన్నారు. మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి సంస్థ ద్వారా సబ్సిడీలపై రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాని బాబు, రామచంద్రపాలెం మాజీ సర్పంచ్ టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు నంబారు రాము, స్కూల్ కమిటీ ఛైర్మన్ జి రాము గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో

ఆంధ్ర ప్రజల ఆశలపై నీళ్లు...

రాష్ట్రానికి జరిగిన అన్యాయం పై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలి : సిటూ

విశాలాంధ్ర-మునగపాక: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర బిజెపి మరోసారి చేసిన ఈ ద్రోహానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని గనిశెట్టి ప్రజలకు పిలుపునిచ్చారు. బడ్జెట్లో ఏపీకి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందని అన్నారు. ప్రత్యేక హోదా, వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి యువజన హామీలను పక్కన పెట్టిందని గనిశెట్టి తెలిపారు. గత బడ్జెట్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను వెనకబడిన ప్రాంతాలుగా గుర్తించిన ఒక్క పైసా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లో వాటి ఊసు కూడా లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కూడా సూచన ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీనిపై ముఖ్యమంత్రి స్పందించాలని గనిశెట్టి డిమాండ్ చేస్తారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని అన్నారు. ఈ దగాకూరు బడ్జెట్ను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలన్నారు. మరోవైపు వైజాగ్ స్టీల్ ప్లాంటకు గత ఏడాది రూ 8622 బడ్జెట్లో కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్లో రూ 3295 కోట్లు కేటాయించింది. అంటే గత ఏడాది కంటే బడ్జెట్లో రూ 5327 కోట్లు తగ్గించింది. ఆర్భాటంగా ప్రకటించిన రూ 11400 కోట్ల ప్యాకేజీ ప్రస్తావన లేదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం మోసం చేయడమే ఆంధ్రప్రదేశ్ కి కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహంపై ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు.

శరవేగంగా తారురోడ్లు నిర్మాణం

నిర్మాణ దశలో ఉన్న వెంకటాపురం రోడ్డు

విశాలాంధ్ర-యస్. రాయవరం: మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలకు గ్రామాలకు మధ్య రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు అయ్యాయి అందులో భాగంగా పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో తారు రోడ్డుతో పాటు సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. కొద్ది సంవత్సరాలుగా సరైన రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో రాష్ట్ర హోంమంత్రి స్థానిక ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లో మెటీరియల్ కింద నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా పెనుగొల్లు నుంచి వమ్మవరం వరకు సుమారు 1.7 కిలో మీటర్ల పొడవు గల రోడ్డుకు సుమారు 75 లక్షల రూపాయలు మంజూరు అవడంతో పెనుగొల్లు గ్రామంలో 420 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణం మిగతా భాగంలో తారు రోడ్డు నిర్మాణం పనులు చేయడం జరుగుతుంది. ఉప్పరాపల్లి నుంచి వెంకటాపురంకు 1.2 కిలోమీటర్లు కు 64 లక్షలు తో తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. వెంకటాపురం నుంచి బంగారమ్మ పాలెం వరహానది వరకు 1.7 కిలోమీటర్లకు 65 లక్షలు నిధులతో తారు రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. అదేవిధంగా పేటసూదిపురం గ్రామానికి ఎలమంచిలి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు నుంచి రోడ్డు నిర్మాణానికి 52 లక్షలు నిధులు తో కొంతమేర సిమెంట్ రోడ్డు తో పాటు తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుంది కాంట్రాక్టు ఏజెన్సీలు ఈ పనులను చేయడం జరుగుతుంది. ఈ రోడ్లు పూర్తయితే వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు .

పనులు ప్రారంభించిన వమ్మవరం రోడ్డు

తీర్థాల్లో జోరుగా బల్లాటలు, కోడిపందాలు, అసాంఘిక కార్యక్రమాలు

- లంచాల మత్తులో అరికట్టలేకపోతున్న, పోలీసులు, ప్రభుత్వ అధికారులు ...

- పోలీసుల సాక్షిగా బహిరంగంగా జూదం, కోడిపందాలు, నాటుసారా, మద్యం విక్రయాలు

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం చుట్టుపక్కల గ్రామాల్లో నిర్వహిస్తున్న పండుగలు, తీర్థాల్లో జోరుగా జూదం, లాటరీ బల్లాటలు, కోడి పందాలు, నాటుసారా, చీప్ లిక్కర్ (కల్తీ మద్యం), అసాంఘిక కార్యకలాపాలను కూటమి నేతలు, గ్రామ సర్పంచులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అండదండలతో పోలీసులు, ప్రభుత్వ అధికారులు సాక్షిగా బహిరంగంగా నిర్వహిస్తున్నారు. చోడవరం శివారు అన్నవరం వెంకయ్య గారి పేటలో ఆదివారం నిర్వహించిన ముత్యమాంబ అమ్మవారి తీర్థంలో స్థానిక పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలో లాటరీ బల్లలు, సాంఘిక కార్యక్రమాలు యదేచ్ఛగా నిర్వహించారు. ప్రజలకు శాంతిభద్రతలు కల్పించాల్సిన పోలీస్ అధికారులు రాజకీయ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని మహిళలు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. గ్రామాల్లో నిర్వహించే తీర్థాలు పండుగలలో అసాంఘిక కార్యకలాపాలతో ప్రభుత్వ అధికార యంత్రాంగం భారీ హింసకు కారణం అవుతున్నారని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. అంకుపాలెం, అడ్డూరు, ఖండేపల్లి, అన్నవరం తదితర గ్రామాల్లో కూటమి, రాజకీయ నేతలు అండదండలతో పోలీసులు సాక్షిగా జరుగుతున్న తీర్థాల్లో లాటరీ బల్లలు, అసాంఘిక కార్యక్రమాలు బహిరంగంగా నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రశ్నించే గొంతులు పై అక్రమ కేసులు బనాయిస్తామంటూ పోలీసులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు అని స్థానికులు, మహిళ, ప్రజా సంఘాలు ఆరోపిస్తు న్నాయి. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అధికారులు, నాయకులు పై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామస్తులు, మహిళలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) భీమిలి జోన్ మహాసభ

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి జోన్ మహాసభ తగరపువలస సిఐటీయు ఆఫీస్ లో జరిగింది. భీమిలి ప్రాంతంలో 6 క్లబ్స్ వున్నాయి. ప్రతి 3 సంవత్సరముల కు ఒకసారి మహాసభ జరిపి పిల్లల పెద్దల కమిటీ వేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం కి విసిసి జిల్లా జాయింట్ సెక్రటరీ డి.శైలజ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు అనే వాళ్ళు ఈ ప్రపంచంలో అత్యంత విలువైన వారు. నేటి బాలలే రేపటి పౌరులు. అటువంటి పిల్లలు ఈ రోజు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పౌష్టికాహార లోపం, మత్తు, గంజాయి, మొబైల్ కి అడిక్ట్ అవ్వడం, చదువు అయ్యాక ఉపాధి అవకాశాలు లేక నేర ప్రవృత్తి పెరుగుతున్నదని దీనిని ఎదుర్కొనేందుకు విసిసి పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంచడం బాలలో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను పెంచడం సంస్కృతి, కళలు నేర్పించడం క్రీడలను ప్రోత్సహించడం ప్రకృతి పట్ల ఆసక్తి, పర్యావరణం పై అవగాహన పెంపొందించడం శారీరక, మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించడం, సమ్మర్ క్యాంపులు, మ్యాజిక్ షోలు నిర్వహించడం, దేశభక్తి పెంపొందించి , సమాజంలో వారి పాత్రను తెలియ చెయ్యడం శ్రమ పట్ల గౌరవం, సమిష్టితత్వాని పెంపొందించడం, సైన్సు, మూఢ నమ్మకాల పై అవగాహన కల్పించడం ఇతరులకి సహాయపడడం ప్రధానమైన లక్ష్యాలుగా తీసుకోవడం జరిగిందని తెలియజేసారు .పై లక్ష్యాలు అమలు కోసం క్లబ్ మరియు జోన్ కమిటీలు ఏర్పాటు చేశారు . మహాసభ లో తేజ శ్రీ రిపోర్టు ప్రవేశ పెట్టగా, అనంతరం ఏరియా వారీగా చర్చించి ప్రణాళిక చేశారు. ఒక క్లబ్ స్థాయిలో విజ్ఞాన, వినోద, సాంస్కృతిక, శాస్త్రీయ, క్రీడా, మేధో, సేవా, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించడం. ఇంటర్ రిఫ్రెష్మెంట్ క్యాంపు, వేసవి వినోదం, సమ్మర్ క్యాంపు, దసరా క్యాంపు, మాజిక్, సాంస్కృతిక, సైన్సు అంశాల పై శిక్షణ ఇవ్వడం. చిల్డ్రన్స్ డే పోటీలు, సండే స్పార్క్, సైన్స్ డే (మ్యాజిక్), వేసవి వినోదం వంటి కార్యక్రమాలు ప్లాన్ చేయడం జరిగింది. ఈ మహాసభ సహకరిస్తున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదములు తెలియజేసింది. నూతనంగా ఎన్నికైన కమిటీకి కన్వీనర్ గా తేజు కో కన్వీనర్లు గా నాగరాణి గుణమ్మ పెద్దల నుంచి ఎంపిక కాగా శిరీష ,లక్ష్మి,పుష్ప,దుర్గ,పోతురాజు పిల్లల నుంచి ప్రెసిడెంట్ గా ఝాన్సి సెక్రటరీ గా సౌమ్య వైస్ ప్రెసిడెంట్ గా శేషంక్ జాయింట్ సెక్రటరీ గా చాందినీ ఎంపిక కాగా భావన, భను ప్రకాష్ను కమిటీలో తీసుకున్నారు.

మద్యం విధానాల్లో సి.ఎం. ఆదేశాలు ఎక్సైజ్ అధికారులు బేఖాతరు

- ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు
- ఎక్సైజ్, ప్రొబేషనరీ శాఖ అండదండలతో గ్రామాల్లో జోరందుకున్న మద్యం గొలుసు దుకాణాలు
- గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలకు బహిరంగ వేలం పాటలు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం సర్కిల్ ఎక్సైజ్ మరియు ప్రొబేషనరీ శాఖ అధికారులు ఏ.పీ సీ.ఎం చంద్రబాబు నూతన మద్య విధానాలను బేఖాతరు చేస్తూ గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారని మహిళలు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపద్యంలో సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోను, పాన్ షాపుల్లోనూ మద్యం బెల్టు దుకాణాలు జోరందుకున్నాయి. అధికార కూటమి నేతలు, ప్రతిపక్ష నేతలు దందా, ఎక్సైజ్ అధికారుల ప్రోత్సాహంతో పంచాయతీల్లో మద్యం గొలుసు దుకాణాలకు బహిరంగంగా వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో లక్షలాది రూపాయలు పంచాయితీ, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఎక్సైజ్ అధికారులకు అప్పచెప్పిన వేలం దారులు మద్యం గొలుసు దుకాణాల్లో 24/7 మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ అధికార నేత సి.ఎం. చంద్రబాబు మద్యం పై విధించిన నిభందనలకు తూట్లు పొడిస్తూ, రికార్డు స్థాయిలో చోడవరం సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గొలుసు దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గొలుసు దుకాణాల పై ఉన్నతాధికారుల దృష్టి పడకుండా ఉండేందుకు అడపాదడపా దాడులతో అమాయకులపై కేసులు బనాయించి ఎక్సైజ్, పోలీస్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ప్రజా, మహిళ సంఘాలు ఆరోపిస్తున్నాయి. గొలుసు దుకాణాలు పై దాడులు నుండి తప్పించు కునేందుకు తరచూ ప్రజా ప్రతినిధులకు, డిపార్ట్మెంట్ కు (పోలీస్, ప్రొబేషన్ & ఎక్సైజ్ తదితర) భారీ లంచాలు సమర్పించు కోవలసి వస్తోందని మద్యం గొలుసు దుకాణ దారులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలు వలన రాత్రి, పగలు తేడా లేకుండా మందుబాబులు విచ్చలవిడి తనం అయిపోయిందని మహిళలు, స్థానికులు ఆరిపిస్తున్నారు. గొలుసు దుకాణాల్లో మద్యం లభిస్తుండడంతో విచ్చలవిడితనంతో బాటు గంజాయి, సిగరెట్లు తాగడంతో యువత ఎక్కువగా అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులై భావి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు అరికట్టి, స్వేచ్చాయుత ప్రజా జీవనానికి రక్షణ కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సభ్యుడు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, ప్రజా మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మర అడవులు మానవ మనుగడకు భరోసా

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

విశాలాంధ్ర-సబ్బవరం: మర అడవులు పకృతికి ,జీవన వైవిధ్యానికి ఎంతో దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి .సీతాలక్ష్మి అన్నారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ వెట్ ల్యాండ్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి మాట్లాడుతూ, అడవులు ముఖ్యంగా మర అడవులు ప్రకృతికి, జీవవైవిధ్యానికి ఎంతో దోహదపడతాయి అని, కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి అడవుల పెంపకం మరియు సంరక్షణ జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలి అని ఈ సందర్బంగా విద్యార్థులను కోరారు... ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. శంకర్, జువాలజీ లెక్చరర్ డాక్టర్. ఎం రత్న ప్రకాష్ , జాతీయ సేవా సమితి ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ బిస్పోక్ ఏఐ విండ్ ఫ్రీ ఏసీ శ్రేణి విడుదల

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, ఈరోజు తన బిస్పోక్ ఏఐ విండ్ ఫ్రీ ఎయిర్ కండీషనర్‌ల 2025 శ్రేణిని విడుదల చేసింది. ఇది అత్యాధునిక ఏఐ సాంకేతికత మరియు ప్రీమియం డిజైన్‌ల కలయిక. ఇంటెలిజెంట్ కూలింగ్, ఎనర్జీ ఎఫిషియెన్సీ మరియు కనెక్టెడ్ లివింగ్‌పై దృష్టి సారించి, కొత్త శ్రేణి 19 మోడల్‌లు భారతీయ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న డిమాండ్‌లను తీరుస్తాయి. ఈ ఎయిర్ కండిషనర్‌లు భారతదేశం యొక్క తీవ్రమైన వేసవికాల సవాళ్లను పరిష్కరించేటప్పుడు సౌకర్యం, సౌలభ్యం, ఆవిష్కరణలను అందించడానికి ఆలోచనాత్మకంగా రూపొందించబడ్డాయి. ఈ శ్రేణి ఏఐ-ఆధారిత ఆవిష్కరణలను వివిధ వాతావరణ పరిస్థితులలో సజావుగా స్వీకరించడానికి, స్థిరమైన సౌలభ్యం మరియు గరిష్ట సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది. విండ్ ఫ్రీ కూలింగ్ టెక్నాలజీ డైరెక్ట్ డ్రాఫ్ట్‌లను తొలగిస్తుంది.

సి.ఎన్.ఆర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే పంచకర్ల ప్రారంభం

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88 వ వార్డు వెదుళ్ళనరవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సి.ఎన్.ఆర్ హాస్పిటల్ ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ 88 వ వార్డు వెదుళ్లనరవ పరిసర గ్రామాల ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించి ఈ ప్రాంత ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అనునిత్యం అందుబాటులో ఉండాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, సీనియర్ నాయకులు ఇందల వెంకట రమణ, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, పీ.బి.వి.ఎస్.ఎన్ రాజు, రాజాన పైడిరాజు, హాస్పటల్ సిబ్బంది, జీవీఎంసీ 88వ వార్డు ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం జిల్లా పరిషత్ హై స్కూల్ 1976-77 సంవత్సరం బ్యాచ్ కు చెందిన విద్యార్థులు అడ్డూరు డాక్టర్ నాగిరెడ్డి వెంకటరమణ తోటలో ఆదివారం అపురూప కలయికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మధుర స్మృతులను,తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు.వారి వారి పిల్లలు ఏం చేస్తున్నారని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువులను మనసారా స్మరించుకున్నారు. అందరూ సహ పంక్తి భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేసుకొని విందు ఏర్పాటు చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. వి. రమణ , ఎం.జి. నారాయణ, బోకం పైడితల్లి,రొంగలి శంకర్రావు, గెడ్డం దుర్గారావు, ఎడ్ల లక్ష్మి,గొర్లి సత్యనారాయణ, రావాడ శ్రీరామ్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెసలమ్మ తల్లి తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని అసకపల్లి పంచా యితీ శివారు సున్నం బట్టీలు గ్రామంలో గ్రామ ప్రజలు ఆరాధ్యదైవ మైన శ్రీశ్రీ పసలమ్మ తల్లి అమ్మవారి 30వ తీర్థ మహోత్సవం పిఏసిఎస్ మాజీ చైర్మన్ ,బంగారమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ కాపుశెట్టి శేషబాబు ఆధ్వర్యంలో ఆదివారం వైభంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ మాజీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, సీనియర్ నాయకులు గండి రవికుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుండి విశాఖపట్నం వారిచే డాన్స్ మస్తీ మెగా డాన్స్ షో, పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేవుడమ్మ, ఎంపీటీసీ కర్రీ అప్పారావు, సచివాలయం కన్వీనర్ కాపుశెట్టి నీలమణి, వైసిపి నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి కర్రి బాబు, ఎడ్ల నాయుడు, ఐ.డి బాబు, పి రమేష్ నాయుడు, సిరికి దేముడు, వైస్ ప్రెసిడెంట్ కరణం సురేష్ ,నోట్ల కనకరాజు, కర్రీ కనకరాజు, చుక్కా కనకరాజు, పల్లి సురేష్, గోవిందు, ఎంపీటీసీలు, సర్పంచులు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాదంబేశ్వరి అలంకరణలో శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు శ్యామా అమ్మవారిని కాదంబేశ్వరి శ్యామా అమ్మవారి గా దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం శ్యామా అమ్మవారికి శ్రీ మేరు మొదటి అంతస్థులో.. వేదమంత్రాల నడుమ.. మొదట సుగంధజలాలతోనూ, అటుపైన గోక్షీరాలతోనూ అహూతులైన దేశ విదేశీ భక్తులందరూ అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఆయుర్వేద పరంగానే గాక, పవిత్రతకు చిహ్నాలైన బహుళ ఉపయోగాలున్న కదలీ పత్రాలనేలనే వస్త్రాలుగా ధరించి శోభాయమానంగా అద్వితీయ దర్శనమిస్తూ, కటాక్షించారు.. సాయంత్రం 4 గంటల నుండి కాదంబేశ్వరీ సహిత సారికా శ్యామా హవనం హెూమం నిర్వహించారుఈ హెూమం తో సాహిత్య, కవిత్వ, సౌభాగ్య, న్యాయ విద్యా సిద్ధి ని కలుగ జేస్తుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. అటుపైన కామాఖ్య పీఠం ముందు, మహాశక్తివంతమైన షట్చక్ర శుద్ధి.. కలిగించే శక్తి పాత ప్రక్రియ " కళావాహన" జరుపుకున్నవారి లో దేశ విదేశీయులు పాల్గొన్నారు.గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ భక్తులను ఆశీర్వ దించారు. అలాగే ఆశ్వయుజ బహుళ పాడ్యమి నాడు మొదలైన 108 రోజుల నుండి దేవీపుర ప్రాంగణము లో ప్రపంచ శాంతి, యుద్ధ భయ నివారణ, దేశ ఆర్థికవ్యవస్థ సర్వతో ముఖ అభివృద్ధి, ప్రస్తుత అధికారంలో ఉన్నజాతీయ పార్టీ మరింత సమర్థవంతంగా దేశాన్ని నడిపించాలనే సంకల్పంతో జరుగుతున్న వారాహీ సహిత చండీ హెూమం నేడు చివరిగా 108 వ రోజు జరిగింది. ఇట్టి బృహత్కార్యాన్ని అధిక వ్యయ ప్రయాసలతో నిర్వహింప జేసిన విశాఖ కు చెందిన విశ్రాంత మర్చంట్ నేవి అధికారి క్రాఫ్ట్ దీపిక్ ని గురుమాత ప్రత్యేకముగా ఆశీర్వదించి దేవీపుర అమ్మవారి యొక్క ప్రత్యేక దుశాలువ తో సత్కరింప జేశారు. ఈ కార్యక్రమాలను దేవిపురం నిర్వాహకులు కందర్ ప్రభాకర్, రామా పర్యవేక్షించారు.

10రోజుల్లో ఆతవ రోడ్డు పనులు ప్రారంభం : ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-చేపాడ : మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ గత వారం రోజులుగా గ్రామస్తులు ధర్నా చేస్తున్న విషయం విధితమే ఈ మేరకు ఆదివారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకురి రఘురాజు ధర్నా వద్దకు చేరుకొని పది రోజుల్లో రోడ్డు నిర్మాణం పనులు చేపడం జరుగుతుందని ఇచ్చిన హామీ మేరకు,ఉద్యమకారులు చల్లా జగన్,కర్రి దేముడు,ధర్నా విరమిస్తామని చెప్పి ఈనెల 10 నాటికి కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోయినా మరల ధర్నాకు దిగడం జరుగుతుందని కరాకండిగా చెప్పడంతో స్పందించిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నా సొంత డబ్బులు పెట్టుబడి పెట్టైనా ఈనెల10న పనులు ప్రారంభించి,పనులు చేయిస్తానని ఎమ్మెల్సీ రఘురాజు హామీ ఇచ్చారు. ఇంతటితో ధర్నా విరమిస్తున్నామని చెప్పి పనులు పూర్తి చేసి మా కష్టాలు తీర్చాలని గ్రామస్తులు వేడుకోన్నారు. అలాగే ఎమ్మెల్సీ చొరవ చేసి ఆందోళన విరమింప చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన ఉద్యమకారులు.